
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
మంగళవారం 4 ఫిబ్రవరి 2025

బంగారం, వెండితో ఉడాయించిన
నగల తయారీదారుల అరెస్ట్
గంజాయి స్వాధీనం
బైక్‌పై వెళ్తూ అడవి పందిని ఢీకొట్టి..
ఎమ్మెల్యే గన్‌మన్ మృతి
7 లో

ఖైదీలూ మనుషులే..

వారికందించే భోజనం ఇలాగేనా?

జిల్లా న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్


ఖైదీలకు అందించే ఆహారాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి రమేష్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఖైదీలు కూడా మనుషులేనని వారికి అందించే భోజనం నాణ్యత లేకుండా ఉంటే ఎలాగని జైలు అధికారులను జిల్లా న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ ప్రశ్నించారు. కంది మండల కేంద్రంలోని జిల్లా జైలును సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఖైదీలకు ఇచ్చే బెడ్‌షీట్లు, బ్యారక్‌లను పరిశీలించారు. సమాయానికి ములాఖత్‌లు అందుతున్నాయా అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. కేసులు పరిష్కరించేందుకు న్యాయసేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని ధైర్యంగా ఉండాలని ఖైదీలకు తెలిపారు. ఖైదీలకు అందించే భోజనాన్ని రుచి చూసి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జైలు అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జైలు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

తెలంగాణ ప్రజలకు బీజేపీ క్షమాపణ చెప్పాలి

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి
- సంగారెడ్డిలో ప్రధాని మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మల దహనం
- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు


సంగారెడ్డిలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసినందుకు ఈ ప్రాంత ప్రజలకు బీజేపీ క్షమాపణలు చెప్పాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం సంగారెడ్డిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అధ్యక్షతన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. లక్షల్లో పన్నులు చెల్లిస్తున్నప్పటికి కేంద్రం తెలంగాణకు మాత్రం గుండు సున్న ఇచ్చిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు మాత్రం ఒక్క రూపాయి కూడా తీసుకురాలేని దద్దమ్మలని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలకు బీజేపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ఆంజనేయులు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోస్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొంగులరవి తదితరులు పాల్గొన్నారు.


సంగారెడ్డిలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

రండి.. చేరండి..

బడిబాట పట్టిన ప్రభుత్వ కాలేజీల లెక్చరర్లు

- ఇంటర్ అడ్మిషన్లపై ఫోకస్
- జిల్లాలో గవర్నమెంట్ కాలేజీ లెక్చరర్ల ముమ్మర ప్రచారం
- జిల్లా అకాడమిక్ సెల్ ఏర్పాటు
- ప్రతీ అధ్యాపకుడు మూడు పాఠశాలల సందర్శన
- పదో విద్యార్థులను కలిసి తమ కాలేజీ చేరాలని కరపత్రాల పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా 59 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు
- 12,484 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు


రాంపూర్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు కరపత్రాలు అందజేసి తమ కాలేజీలో చేరాలని కోరుతున్న గవర్నమెంట్ కాలేజీ లెక్చరర్లు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ప్రతీ ఏడాది తగ్గుతుండడంతో ఇంటర్‌బోర్డు చర్యలకు ఉపక్రమించింది. అడ్మిషన్లు పెంచడానికి చర్యలు చేపట్టింది. కళాశాల్లో పనిచేస్తున్న ప్రతీ లెక్చరర్ సమీపంలోని మూడు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులను తమ కళాశాలలో చేరేవిధంగా అవగాహన కల్పించాలని నిర్దేశించింది. కళాశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఉచిత పాఠ్యపుస్తకాల వంటి వాటి గురించి వివరించాలని నిర్ణయించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాలల్లో మధ్యాహ్న భోజన వసతి కల్పించనున్న విషయాన్ని వివరించాలని కూడా ఆదేశించారు.

మెదక్ జిల్లాలో జోరుగా ప్రచారం

ఇంటర్ విద్యాశాఖ ఆదేశాల మేరకు ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లు పెంచేలా చేపట్టిన లెక్చరర్ల బడిబాట కార్యక్రమం మెదక్ జిల్లాలో జోరుగా సాగుతున్నది. ముగ్గురు అధ్యాపకులతో జిల్లాస్థాయి అకడమిక్ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లా కమిటీలో మెదక్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న హిస్టరీ లెక్చరర్ వసంతరావు, పెద్దశంకరంపేట జూనియర్ కళాశాల మ్యాథ్స్ లెక్చరర్ హరిత, నర్సాపూర్ కళాశాల

మిగతా 8వ పేజీలో



7 లో

ఉద్యాన రైతుకు ఊతం..

సీఈవో కేంద్రం

- ములుగులో ఉద్యాన పంటలపై పరిశోధనలు
- మేలైన రకాల పెంపకం
- కేంద్రం ద్వారా రైతులకు నారు, మొక్కల సరఫరా

ఇరువర్గాల

ఘర్షణ

- స్వల్ప విషయానికి వాగ్వాదం
- పరస్పరం దాడులు
- పది మందికి గాయాలు

7 లో

కాగితాల్లోనే కాసులు

అవార్డులు పొందిన ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలకు అందని కేంద్రం నజరానా

ప్రొసీడింగ్స్ వచ్చినా ఖాతాల్లో జమ కానీ సొమ్ము


ఎన్‌క్వాస్ అవార్డుకు ఎంపికైన సంగారెడ్డి ఇంద్రనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పలు అవార్డులను ప్రకటించి నగదు ప్రోత్సాహాలను అందజేస్తున్నది. సంగారెడ్డి జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలకు ఏడాదిన్నర క్రితం అవార్డులు వరించినా ఇప్పటివరకు నజరానా మాత్రం అందలేదు. సంగారెడ్డిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) లక్ష్య, ముస్కాన్ అవార్డులకు ఎంపికయ్యాయి. 2023 మే 26న ఎంసీహెచ్ ఆస్పత్రి 91.0 స్కోర్‌తో ముస్కాన్ అవార్డుకు ఎంపికైంది. ఏడాదికి రూ.12 లక్షల చొప్పున మూడేళ్లలో రూ.36 లక్షల ప్రోత్సాహక నగదు మంజూరు చేస్తామని అప్పట్లో ప్రకటించారు. ఇదే ఎంసీహెచ్ ఆస్పత్రి 2023 జూన్ 5న 'లక్ష్య' అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డుకు సైతం ఏటా రూ.12 లక్షల చొప్పున మూడేళ్లు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. కానీ, ఇంత వరకు ఒక్క పైసా విడుదల కాలేదు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిని ముస్కాన్ అవార్డుకు ఎంపిక చేసినట్లు 2023 డిసెంబరు 1న ప్రకటించారు. ఈ అవార్డు వచ్చినందున ఆస్పత్రికి

మిగతా 8వ పేజీలో



ఏడుపాయలలో

వసంత పంచమి

వసంత పంచమిని పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అర్చకులు వీణ, పుస్తకాలు, పలకలు, పెన్నులు, పుష్పాలతో సరస్వతీ దేవి రూపంలో అలంకరించారు.

-పాపన్నపేట, (ఆంధ్రజ్యోతి)



ట్రాక్టర్ వెనుక

కొంగల ఆహార వేట


కంది మండలం చిమ్నాపూర్ గ్రామంలో ఓ రైతు తన పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతుంటే వెనుక కొంగలు ఆహార వేటలో నిమగ్నమయ్యాయి. దుక్కి దున్నినప్పుడు భూమిలోంచి బయటకువచ్చే కీటకాలను తినడానికి కొంగలు టాక్టర్ కల్టివేటర్ వెనకే తిరగడాన్ని రైతులు, రైతు కూలీలు ఆసక్తిగా చూస్తూ ఉండిపోయారు.

-స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

వంతెన పనులు చకచకా..

- రూ.172 కోట్లతో 1.65 కి.మీ.ల మేర 6 లేన్ల ఫ్లైఓవర్
- బీహెచ్‌ఈఎల్ కూడలిలో తీరనున్న ట్రాఫిక్ సమస్య
- పూర్తయితే అరగంట ప్రయాణం 5 నిమిషాల్లోనే..

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర నుంచి సంగారెడ్డి ముఖ ద్వారంగా ఉన్న రామచంద్రాపురం-బీహెచ్‌ఈఎల్ కూడలిలో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు చకచకా సాగుతున్నాయి. 1.65 కిలోమీటర్ల మేర ఆరు లేన్లతో ఈ వంతెనరు నిర్మించేందుకు రూ.172 కోట్లు మంజూరయ్యాయి. చందానగర్ నుంచి బీహెచ్‌ఈఎల్ కూడలి పైనుంచి రామచంద్రాపురం జ్యోతి థియేటర్ వరకు వంతెన నిర్మాణం చేపట్టారు. వంతెన కింది భాగంలో రెండు వైపులా మూడు వరుసల చొప్పున రోడ్డును విస్తరిస్తున్నారు. రెండు వరద కాల్వల నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. ఫ్లైఓవర్ కింద మూడు యూటర్న్‌లు పెట్టారు. ఈ వంతెన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి ప్రస్తుతం డివైడర్ ఏర్పాటు, వంతెన గోడలకు బటర్‌ఫ్లై లైట్లు అమరుస్తున్నారు. రెండు వైపులా అప్రోచ్‌రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. మార్చి నెలలో ప్రారంభించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు జాతీయ రహదారుల సంస్థ అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి సంగారెడ్డి వైపు బీహెచ్‌ఈఎల్ చౌరస్తా మీదుగా పటాన్‌చెరు వైపు ప్రతీరోజు దాదాపు లక్ష వాహనాలు ప్రయాణిస్తుంటాయని అధికారులు అంచనా వేశారు. బీహెచ్‌ఈఎల్ కూడలిలో ఫ్లైఓవర్ పూర్తయితే మియాపూర్-రామచంద్రాపురం-పటాన్‌చెరు మధ్య ట్రాఫిక్ అంతరాయం తగ్గుతుంది. సంగారెడ్డి జిల్లా నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్రల నుంచి హైదరాబాద్ వచ్చే వారు వేగంగా చేరుకోగలుగుతారు. చుటుపక్కల పారిశ్రామికవాడలకు వచ్చే వాహనాలు సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా వస్తాయి.


రామచంద్రాపురం-బీహెచ్‌ఈఎల్ కూడలిలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్

వచ్చే నెలలో ప్రారంభానికి సిద్ధం చేస్తాం

రామచంద్రాపురం-బీహెచ్‌ఈఎల్ కూడలిలో ఫ్లైఓవర్ పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెలలోపు మిగిలిన పనులను పూర్తిచేసి వంతెనను ప్రారంభించమే లక్ష్యంగా పనులు చేయిస్తున్నాం. గడువు లోపు నిర్మాణాన్ని పూర్తిచేసి వాహనాలను అనుమతించేందుకు కృషిచేస్తున్నాం.

-రామకృష్ణ, డీఈ, జాతీయ రహదారుల విభాగం


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఎన్నికల ప్రచారానికి

అనుమతులు తప్పనిసరి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నిజాంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రచారాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తగు సలహాలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ప్రతి ఒక్కరూ నియమావళిని పాటించాలని సూచించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ షురూ


ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్ పరిశీలిస్తున్న డీఐఈవో గోవిందరామ్

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 22 వరకు పరీక్షలు జరగనున్నాయి. సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల, కొండాపూర్ పరిధిలోని శ్రీ అక్షయ జూనియర్ కళాశాల కేంద్రాలను సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈవో) గోవిందరామ్ తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించామని తెలియజేశారు.

మెదక్ జిల్లాలో..

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు మెదక్ జిల్లా వ్యాప్తంగా 33 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌లో ఒకేషనల్, జనరల్ విద్యార్థులకు సంబంధించి 913 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 823 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు ఒకేషనల్, జనరల్ విద్యార్థులకు సంబంధించి 878 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 857 మంది హాజరయ్యారైనట్లు ఇంటర్ జిల్లా నోడల్ అధికారి మాధవి తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎలాంటి సమస్యలు లేకుండా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.



నో హెల్మెట్.. నో ఎంట్రీ

సిద్దిపేట ఆర్టీవో కార్యాలయంలోకి హెల్మెట్ లేకుండా వాహనాదారులను అనుమతించటం లేదు. తమ స్వీయ భద్రత విషయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

- సిద్దిపేట జిల్లా ఫొటోగ్రాఫర్(ఆంధ్రజ్యోతి)

సెట్విన్ కోర్సులు.. ఉపాధికి అడుగులు

జహీరాబాద్‌లో తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి




జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన సెట్విన్ కార్యాలయం, కంప్యూటర్ ల్యాబ్

జహీరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో యువతకు నైపుణ్యం కల్పించి ఉపాధి సామర్థ్యాలను పెంపొందించేందుకు విభిన్న శ్రేణి కోర్సులను అందించేందుకు వీలుగా సెట్విన్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ అండ్ ట్రైనింగ్ ఇన్ ట్విన్‌సిటీస్) శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జహీబాద్ పట్టణంలో కొన్ని ప్రైవేటు సంస్థలు వివిధ రకాల శిక్షణ కోర్సులను ఏర్పాటు చేసి శిక్షణను ఇస్తున్నప్పటికి ఆర్థిక స్థోమత లేనివారు అందుకు విముఖతను చూపుతున్నారు. గతంలో హైదరాబాద్, సికింద్రాబాద్ లాంటి జంట నగరాలకే పరిమితమైన సెట్విన్ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు విస్తరిస్తున్నది. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాలో, ముఖ్యంగా జహీరాబాద్ ప్రాంతంలో యువత పడుతున్న ఇబ్బందిని గమనించిన సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ చూపి శిక్షణ కేంద్రాన్ని జహీరాబాద్‌లో ఏర్పాటు చేయించారు.

రూ.20 లక్షలతో సెట్విన్ కేంద్రం

వికారాబాద్, తాండూర్, జహీరాబాద్ సంగారెడ్డి, జడ్చర్ల తదితర ప్రాంతాల్లో సెట్విన్ సేవలను విస్తరించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేసింది. జహీరాబాద్‌లో కోర్సులను ప్రారంభించేందుకు అంతా సిద్ధం చేశారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద రూ.20 లక్షల వ్యయంతో సెట్విన్ కేంద్రం నిర్వాహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. శిక్షణ కేంద్రంలో సామగ్రిని సమకూర్చి శిక్షకులను నియమించారు. రూ.5లక్షల విలువైన కంప్యూటర్ సామగ్రి, రూ.3లక్షలతో సీసీటీవి, ఇతర సాంకేతిక సామాగ్రి, రూ.4 లక్షలతో కుట్టుమిషన్లను ఏర్పాటు చేశారు. ఒక్కో బ్యాచ్‌కు 25-30 మందిని చేర్చుకోనున్నారు. రోజుకు రెండేసీ బ్యాచ్‌లకు శిక్షణను ఇవ్వనున్నట్లు ట్రైనర్స్ తెలిపారు.

పది రకాల కోర్సులు

సెట్విన్ కేంద్రంలో 10 రకాల కోర్సులను అందుబాటులో ఉంచారు. 7, 10వ తరగతి పాసైన వారు ఇందులో చేరడానికి అర్హులుగా ప్రకటించారు. ఈ కోర్సులకు నామమాత్రపు ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. డిప్లమో ఫ్యాషన్ డిజైన్ కోర్సును మూడు నెలుఉ, ఆరు సెమిస్టర్‌లుగా విభజించారు. మొదటి, చివరి సెమిస్టర్‌లకు రెండు వేల చొప్పున, మిగతా నాలుగు సెమిస్టర్‌లకు రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే డిప్లమో బ్యూటీషియన్ కోర్సును మూడేసి నెలల చొప్పున నాలుగు సెమిస్టర్‌లుగా విభజించారు. మొదటి సెమిస్టర్‌కు రూ.2వేలు, మిగతా మూడు సెమిస్టర్‌లకు రూ.3వేల ఫీజు తీసుకుంటారు. సీసీ టీవీ కోర్సును మూడునెలల పాటు నిర్వహించనున్నారు. రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఏసీ, రిఫ్రిజిరేటర్ మరమ్మతులకు సంబంధించి ఆరు నెలల కోర్సుకు రూ.2,500 చెల్లించాల్సి ఉంది. మొబైల్‌ఫోన్ మరమ్మతు కోర్సు 3 నెలల శిక్షణకు రూ.3 వేలు ఫీజు తీసుకుంటారు. ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, స్పోకెన్ ఇంగ్లీష్ మూడు నెలల కోర్సుకు.. ఒక్కో కోర్సుకు రూ.1500 చొప్పున ఫీజు నిర్ణయించారు. పీపీటీటీసీ(ప్రీప్రైమరీ టీచర్‌ట్రైనింగ్ కోర్సు)ను 6 నెలల పాటు నిర్వహించనుండగా రూ.3500 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అడ్మిషన్లతో పాటు తరగతుల నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని నిర్వాహకులు వివరించారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



జహీరాబాద్ ప్రాంతం ముున్ముందు పారిశ్రామికంగ అభివృద్ధిచెందుతున్న నేపథ్యంలో సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహించే కోర్సులు నిరుద్యోగయువతకు ఎంతగానో దోహదపడుతయి. ఉన్నతస్థాయి అధికారులను,నాయకులను ఒప్పించి, మెప్పించి కర్ణాటక సరిహద్దులో ఉన్న జహీరాబాద్ పట్టణానికి తీసుకురావడమైందన్నారు.ఈఅవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. మున్ముందు మరిన్ని కోర్సులను అందుబాటులోకి తీసుకురావడానికి తనవంతు బాధ్యతగ కృషిచేస్తామన్నారు. జంటనగరాలకే పరిమితమైన సెట్విన్‌ను వ్యవస్థను రాష్ట్ర వ్యాప్తంగ వివిధ జిల్లాలకు విస్తరించడమైందన్నారు.

- గిరిధర్‌రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్



దౌల్తాబాద్ పీహెచ్‌సీ సమీపంలో చెట్లు, పొదలతో బావి

ప్రమాదకరంగా పాడుబడిన బావి

హత్నూర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పాడుబడ్డ బావి ప్రమాదకరంగా మారింది. స్థానిక అవసరాల నిమిత్తం దశాబ్దాల క్రితం ఈ బావిని తవ్వారు. కాలక్రమంలో భూగర్భ జలాలు అడుగంటి, నీరు రాక బావి నిరుపయోగంగా మారి, శిథిలావస్థకు చేరింది. పాడుబడ్డ బావిని ఆనుకొని చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి కమ్మేయడంతో, అక్కడ బావి ఉన్నట్టు కనిపించడం లేదు. పరిసర గ్రామాల నుంచి నిత్యం పీహెచ్‌సీకి వచ్చే రోగులు, ఆ బావిని ఏ మాత్రం చూడకున్నా ప్రమాదం తప్పదు. అధికారులు స్పందించి బావిని పూడ్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పరిహారం అందించి ఆదుకోండి

అదనపు కలెక్టర్‌కు మామిడ్యాల భూనిర్వాసితుల వినతి

ములుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన ప్యాకేజీలు అందించి ఆదుకోవాలని సోమవారం ములుగు మండలం మామిడ్యాలకు చెందిన కొండపోచమ్మసాగర్ భూనిర్వాసితులు తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్‌కు వినతిపత్రం అందించారు. తాము భూములు కోల్పోయి ఆరేడు సంవత్సరాలు అవుతున్నా రావాల్సిన ప్యాకేజీలు రాలేదని అధికారులతో మొరపెట్టుకున్నారు. నిజమైన నిరుపేదలకు ప్యాకేజీ ఇళ్లు అందించకుండా అనర్హులకే ఇచ్చారన్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ మాట్లాడుతూ కలెక్టర్ దృషికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపే విధంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.



అదనపు కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రం

13వ అంతస్తు నుంచి పడి సూపర్‌వైజర్ మృతి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు 13వ అంతస్తు పైనుంచి కింద పడిన సూపర్‌వైజర్ మృతిచెందిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధి ఉస్మాన్‌నగర్‌లో చోటుచేసుకున్నది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బండి మునికుమార్‌రెడ్డి(36) ఆస్త గ్రీన్ హోమ్స్ నిర్మాణ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబసభ్యులతో కలిసి తెల్లాపూర్ ఇంద్రానగర్‌లో నివాసముంటున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం విధులకు వెళ్లాడు. 13వ అంతస్తులో జరుగుతున్న పనులను పరిశీలించేందుకు పైకి వెళ్లాడు. ఇదే చివరి అంతస్తు కాగా, అక్కడ భవనం పేరు కోసం ఏర్పాటు చేస్తున్న కాలంను పట్టుకుని నిలుచున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవ శాత్తు కిందపడ్డాడు. వెంటనే సంస్థ యజమాని ఆదేశాలతో దగ్గరలోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మునికుమార్ మృతిచెందాడు. మునికుమార్ భార్య ఫిర్యాదు మేరకు సీఐ రవీందర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

బైక్‌పై వెళ్తూ అడవి పందిని ఢీకొట్టి..

ఎమ్మెల్యే గన్‌మన్ మృతి


శ్రీనివాస్ (ఫైల్)

పటాన్‌చెరు, రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై వెళ్తూ రోడ్డుకి అడ్డంగా వచ్చిన అడవిపందిని ఢీకొట్టి ఏఆర్ కానిస్టేబుల్, చేవెళ్ల ఎమ్మెల్యే గన్‌మన్ మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి సంగారెడ్డి జిల్లా వెలిమెల తండా శివారులో చోటుచేసుకున్నది. బీడీఎల్ పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం బల్కాపూర్ గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ముత్తంగి శ్రీనివాస్ చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వద్ద గన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్ ఆదివారం రాత్రి కొండకల్ గ్రామం నుంచి వెలిమెల వైపు బైక్‌పై వెళ్తుండగా వెలిమెల తండా సమీపంలో రోడ్డుకి అడ్డంగా వచ్చిన అడవిపందిని ఢీకొట్టి పడిపోయాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న బీడీఎల్ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నందిగామ వద్ద ఒకరికి గాయాలు

నిజాంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : అడవి పంది ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలంలో సోమవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. రామాయంపేటకు చెందిన మద్దూరి మహేష్ తన ద్విచక్ర వాహనంపై నిజాంపేట వైపు నుంచి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో మండల పరిధిలోని నందిగామ శివారు బాట పోచమ్మ ఆలయం వద్ద అడవి పంది వాహనానికి తగలడంతో కిందపడి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

బోర్‌వెల్స్ వాహనం, కారు ఢీ

నలుగురికి తీవ్రగాయాలు

కొండపాక, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బోరు వేసే వాహనం కారు ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన కొండపాక మండలం వెలికట్ట శివారులో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... మిరుదొడ్డి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన లింగాల వెంకటరెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి చేర్యాల మండలం తాడూరుకు శుభకార్యానికి కారులో బయలుదేరారు. వెలికట్ట క్రాస్ రోడ్డు దాటి తాడూరు వైపు వెళ్తున్న క్రమంలో చేర్యాల వైపు నుంచి అంకిరెడ్డిపల్లి వైపునకు వెళ్లేందుకు బోర్‌వెల్స్ వాహనం మలుపు తీసుకుంటున్న క్రమంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. దాంతో కారులో ప్రయాణం చేస్తున్న వెంకట్‌రెడ్డి, ఆయన భార్య పద్మ, బావమరిది తదిపత్రిరెడ్డి, అత్త రాజవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరుకుని గాయాలకు గురైన వారిని సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను బ్లూకోట్ పోలీసులు స్థానికుల సహాయంతో పక్కకు తీసి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

నెలరోజుల వ్యవధిలో భార్యాభర్త మృతి

- భర్త మృతి తట్టుకోలేక భార్యకు పక్షవాతం
- ఆస్పత్రిలో చికిత్సపొందుతుండగా గుండెపోటు


శ్రీనివాస్‌గౌడ్, జ్యోతి(ఫైల్)

చేగుంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రానికి చెందిన భార్యాభర్తలు నెలరోజుల వ్యవధిలో మృతిచెందంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొన్నది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఆయన భార్య జ్యోతికి డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న కుమారుడు దయాకర్ గౌడ్, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న కుమార్తె మానస ఉన్నారు. జనవరి 11న శ్రీనివాస్‌గౌడ్ గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన మృతిని తట్టుకోలేక భార్య జ్యోతి అనారోగ్యానికి గురైంది. పక్షవాతం రావడంతో కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం ఆమెకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతిచెందారు. నెల వ్యవధిలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదం చోటుచేసుకున్నది.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

మిరుదొడ్డి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో భార్యపై కమ్మకత్తితో దాడి చేసిన సంఘటన సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి మధిర గ్రామమైన మాధన్నపేటలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాధన్నపేట వడ్డెరకాలనీకి చెందిన సంతోషకు, చెర్యాల మండలం భాణంపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తలకు గొడవలు జరుగుతున్నాయి. సంతోష కొన్నాళ్లుగా అమ్మగారి ఇంటి వద్ద ఉంటుంది. సోమవారం భాస్కర్ తన బైక్‌లో కమ్మకత్తిని పెట్టుకుని వడ్డెరకాలనీలోని అత్తవారింటికి వచ్చారు. సంతోష కుటుంబసభ్యులు భాస్కర్‌తో మాట్లాడుతుండగానే అక్కడే ఉన్న సంతోషపై ఒక్కసారిగా కత్తితో దాడి చేయగా చేతికి గాయమైంది. భాస్కర్ అక్కడి నుంచి పారిపోతుండగా స్థానికులు పట్టుకున్నారు. 108 అంబులెన్స్ సమాచారం అందించగా, అక్కడిచేరుకుని సంతోషను సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐ హరీష్ తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్


నిందితులను పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను సోమవారం స్థానిక ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని నీరుడిచెరువు వద్ద గంజాయి విక్రయిస్తున్నారని ఎక్సైజ్ పోలీసులు సమాచారం అందింది. చెరువు వద్దకు వెళ్లి అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరిని తనిఖీలు చేయగా వారి స్కూటీలో 250 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయి విక్రయిస్తున్న పట్టణంలోని ముదిరాజ్ బస్తీకి చెందిన నీరుడి సాయికుమార్(25), ఇస్నాపూర్‌కు చెందిన రేణుదేవి(34)ని అరెస్ట్ చేశారు. వారి నుంచి గంజాయితో పాటు స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ పరమేష్‌గౌడ్ తెలిపారు.

బంగారం, వెండితో ఉడాయించిన

ముగ్గురు నగల తయారీదారుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ కాశీనాథ్

జహీరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో బాధితులను మోసం చేసిన కేసులో ముగ్గురు ఆభరణాల తయారీదారులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జహీరాబాద్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ఖాజీపేటలకు చెందిన వెలువలి శేఖ్ చందానిభాష, అతని కుమారులు మహబూబ్ భాష, అఫ్రీద్‌భాష జహీరాబాద్ పట్టణంలోని నాగులకట్ట వద్ద ఎస్ఎండీ జ్యుల్లెరీ పేరుతో 40 సంవత్సరాలు దుకాణాన్ని నిర్వహించారు. వారు బంగారం, వెండి ఆభరణాలను ఆర్డర్‌పై తయారుచేస్తుంటారు. రెండేళ్ల క్రితం దుకాణాన్ని ఎత్తేశారు. నగల తయారీ కోసం 45 మంది నుంచి సుమారు రూ.80 లక్షలు విలువ చేసే బంగారం, వెండిని తీసుకుని ఉడాయించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. వారంతా కుటుంబ సమేతంగా వరంగల్‌లో నివాసం ఉన్నట్లు పోలీసులకు తెలిసింది. సోమవారం వారిని వరంగల్‌లో పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.


ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పెంచుతున్న మామిడి అంటు మొక్కలు

ఉద్యాన రైతుకు ఊతం..

సీఈవో కేంద్రం

- ములుగులో ఉద్యాన పంటలపై పరిశోధనలు
- మేలైన రకాల పెంపకం
- కేంద్రం ద్వారా రైతులకు నారు, మొక్కల సరఫరా

ములుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటల సాగులో రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో ఎన్నో రకాలుగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితి నుంచి రక్షించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సిద్దిపేట జిల్లా ములుగులో ఉద్యానశాఖ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఈవో) కేంద్రాన్ని నిర్వహిస్తున్నది. ఉద్యాన పంటల సాగులో మెలుకువలు నేర్పుతూ, నాణ్యమైన మొక్కలు అందిస్తూ రైతులు లాభాలు ఆర్జించేందుకు కృషి చేస్తున్నది. కేంద్రం ద్వారా రైతులకు మేలైన ఉద్యాన పంటల రకాలను అందజేసేందుకు నిర్ణయించారు. రైతుల డిమాండ్ మేరకు పండ్ల మొక్కలు, కూరగాయల నారు నర్సరీలలో పెంచి రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలోని రైతులకు డిమాండ్ మేరకు అందజేస్తున్నారు.

నారు, పండ్ల మొక్కల పెంపకం

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రంలో కూరగాయలలో టమాట, పచ్చిమిర్చి, వంకాయ, క్యాబేజీ, క్యాలిఫ్లవర్, గెన్ కాలిఫ్లవర్ వంటి నాణ్యమైన రకాలు ఎంపిక చేసి నారు పెంపకం చేస్తున్నారు. రైతుల డిమాండ్ మేరకు పెంచి నారును అందజేస్తున్నారు. పండ్ల మొక్కలలో మామిడి, జామ, దానిమ్మ, నిమ్మ, బొప్పాయి మొక్కలను అంటు పద్ధతి, విత్తనంతో ఉత్పత్తి చేసి అందజేస్తున్నారు. వీటితోపాటు డిమాండ్ ఉన్న శ్రీగంధం, వెదురు మొక్కలను నర్సరీలో పెంచుతూ రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు.



ములుగులోని ఉద్యాన శాఖ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం

మామిడి తోటలకు దన్నుగా

ప్రస్తుతం ప్రధానంగా డిమాండ్ ఉన్న మామిడి తోటల పెంపకంలో రైతులకు దన్నుగా నిలుస్తున్నారు. ప్రయత్నాలు చేస్తున్నారు. మామిడిలో 20 రకాలు ఉండగా, ప్రధానంగా డిమాండ్ ఉన్న ఆరు రకాలు బేనిశా, దసేరి, హిమాయత్, కేసరి, రాయల్ స్పెషల్, రత్న రకాలను అంటు పద్ధతిలో పెంచి రైతులను అందజేస్తున్నారు. జామలో డిమాండ్ కలిగిన అలహాబాద్ సఫెద, లక్నో 49 రకాలైన మొక్కలు పెంపకం చేసి రైతులను ప్రోత్సహిస్తున్నారు.

30 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యం

సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ ఫ్రూట్స్ కేంద్రంలో 2024-25లో 30 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో మామిడి 40 వేలు, జామ 10 వేలు, నిమ్మ 6 వేలు, బొప్పాయి 6 వేలు, శ్రీగంధం 50 వేలు, వెదురు 45 వేలు, అలంకార పూల మొక్కలు 6 వేలు, ఇతర కూరగాయలు లక్ష్యంగా మొక్కల పెంపకం చేస్తున్నారు. రాష్ట్రంలోని కరీంనగర్, సిద్దిపేట, మెదక్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్లా, వరంగల్, జనగామ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఉద్యాన అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకువస్తే ఉచితంగా మొక్కలను అందజేస్తున్నారు.


కూరగాయల నారును పరిశీలిస్తున్న కేంద్రం శాస్త్రవేత్తలు

రైతుల డిమాండ్ మేరకు ప్రణాళిక



రైతుల డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు పలు రకాల మొక్కలు అందించేందుకు ప్రణాళికలు రూపొందించి పెంచుతుంటాం. ఆయా జిల్లాల ఉద్యానశాఖ అధికారుల నిర్ణయం మేరకు మొక్కలు, నారు పెంపకం చేస్తున్నాం. మేలైన మొక్కలు పొందేందుకు రైతులు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి. - శ్రీధర్, ఏడీహెచ్ (సీఈఓ)

బాణాపూర్‌లో

ఇరువర్గాల ఘర్షణ

- కావాలనే స్తంభాన్ని తాకించావంటూ ప్రారంభమైన గొడవ
- పొట్లాడుకున్న బుడగ జంగాలకాలనీవారు, పలువురు గ్రామస్థులు
- పది మందికి గాయాలు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి గొడవ ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. రెండు గ్రూపులు పరస్పరం దాడులు చేసుకోగా పది మంది గాయపడ్డారు. ఈ సంఘటన నారాయణఖేడ్ మండలం బాణాపూర్ గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకున్నది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. నారాయణఖేడ్ మండలంలోని బాణాపూర్ గ్రామం పక్కనే బుడగజంగాల కాలనీ ఉంది. శుక్రవారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్ వెనుకకు తీస్తుండగా బుడగ జంగాల కాలనీ సమీపంలోని ఓ విద్యుత్ స్తంభం విరిగిపోయింది. దీంతో కాలనీతో పాటు, గ్రామంలోని కొన్ని ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామం పక్కనే ఉన్న ఓ విద్యుత్ స్తంభాన్ని శనివారం ట్రాక్టర్‌కు కట్టి తీసుకువస్తుండగా బుడగ జంగాల కాలనీకి చెందిన ఓ వ్యక్తి కాలికి స్తంభం తాకింది. దాంతో అప్పుడు చిన్నగా వాదులాడుకుని వెళ్లిపోయారు. స్తంభం కాలికి తగిలిన బుడగ జంగాల కాలనీకి చెందిన వ్యక్తి సోమవారం గ్రామ సమీపంలో యువకులు క్రికెట్ ఆడుతున్న ప్రదేశానికి వెళ్లాడు. అక్కడ ట్రాక్టర్ నడిపిన వ్యక్తి ఉండగా అతడి వద్దకు వెళ్లి కావాలని తగిలించావంటూ వాగ్వాదానికి దిగాడు. మాటమాట పెరిగి వారిద్దరి మధ్య తగాదా పెద్దగా మారిపోయి బుడగ జంగాల కాలనీ వారు, గ్రామానికి చెందిన వారు అక్కడకు చేరుకుని ఘర్షణ పడ్డారు. రాళ్లు, కర్రలతో దాడులు చేసుకుని కొట్టుకున్నారు. బుడగ జంగాల కాలనీకి చెందిన శ్రీను, శేఖర్, మరో ముగ్గురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన బీరప్ప, వంశీ, కృష్ణ, దుర్గయ్యతోపాటు మరొకరికి గాయాలయ్యాయి. విషయం తెలియగానే పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకితెచ్చారు. గాయపడిన వారిని నారాణఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పరస్పర ఫిర్యాదులతో కేసులు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు

పసి హృదయాలకు 'సంజీవని'

- సత్యసాయి సేవా సంస్థల సేవలు అద్భుతం
- ప్రముఖ సినీనటుడు సుమన్

కొండపాక, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సంస్థలు అందిస్తున్న సేవలు మహోన్నతమైనవని, ఈ స్ఫూర్తితో సేవాతత్పరతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ ఉన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక ఆనంద నిలయం శివారులోని సత్యసాయి సంజీవని హార్ట్ కేర్ రీసెర్చ్ సెంటర్‌ను సినీ నటుడు సుమన్ సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలో ఆపరేషన్ల తీరును పరిశీలించారు. చిన్నారులను పలకరించారు. అనంతరం ఆపరేషన్లు చేసుకున్న నలుగురు చిన్నారులకు మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపాక శివారులో ఏర్పాటైన ఆసుపత్రి చిన్న పిల్లల జీవితాలకు సంజీవనిగా నిలిచిందని, ఇది దినదినాభివృద్ధి చెంది ప్రపంచస్థాయిలో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఎంతో మంది పేదలు వారి పిల్లల గుండె జబ్బులకు వైద్యం చేయించలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, వారందరికీ ఈ ఆసుపత్రి అండగా నిలిచి ఉచిత చికిత్సలు అందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ఎంతో కష్టతరమైనదని సర్జరీలను విజయవంతంగా నిర్వర్తిస్తున్న వైద్యులను ఆయన అభినందించారు. దేశంలో సత్యసాయి సంస్థ ఆధ్వర్యంలోని ఆసుపత్రుల్లో సుమారు 34 వేల గుండె ఆపరేషన్ చేయడం గొప్ప విషయం అన్నారు.

విద్య వైద్యం ఆరోగ్య రంగాలపై సేవలు

విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి మాట్లాడుతూ సత్యసాయి సేవలు దేశ విదేశాల్లో అందిస్తున్నాయని విద్యా, వైద్యం, నీరు, ఆరోగ్యం లాంటివి ప్రజలకు అందిస్తూ ముందుకు సాగుతున్నదన్నారు. ఇలాంటి సేవలు నిరంతరం కొనసాగాలన్నారు. 24 సంవత్సరాల క్రితం తాను అధికారిగా ఉన్నప్పుడు కేవీ కెనాల్ కోసం సత్యసాయి బాబాను కోరగా రూ.175 కోట్లు కెనాల్ నిర్మాణం కోసం సహకారామదించారని గుర్తుచేశారు.


ఆపరేషన్ అయిన చిన్నారితో మాట్లాడుతున్న నటుడు సుమన్

ఆసుపత్రి అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. దేశంలో ఉన్న అన్ని సబ్‌సెంటర్లతో అనుసంధానమై పేదలకు విస్తృత సేవలు అందించాలన్నారు. ఆసుపత్రి ఛైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ బాబా సంకల్పంతో ఆసుపత్రి ఏర్పాటు చేసి పసి హృదయాలకు చికిత్సలు అందిస్తున్నామన్నారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్య సిబ్బంది నిర్విరామంగా కృషి చేస్తున్నారన్నారు. సుమారు 7500 సర్జరీలు చేసిన డాక్టర్ రాగిణి మాట్లాడుతూ సత్యసాయి కృప ఆశీస్సులతో సేవలందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చికిత్స పొందిన పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఆస్పత్రిని దేవాలయంగా, డాక్టర్లను దేవుళ్లగా సంబోధిస్తూ కొనియాడారు. ఎన్నో కష్టాలు పడి ఈ ఆస్పత్రికి వచ్చామని ఇక్కడ అన్ని విధాలుగా అన్ని సౌకర్యాలతో సేవలు అందాయని కృతజ్ఞతలు కార్యక్రమంలో దుర్గ వడ్లమూడి మాట్లాడగా డాక్టర్ స్వప్న, జగన్నాథ శర్మ, గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రిలో శిక్షణ పొందిన సిబ్బందికి మెమెంటోలను అందజేశారు. కొండపాక ఆనంద నిలయం ఆవరణలోని అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమాపార్వతి ఆలయంలో సినీ నటుడు సుమన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఘటం ఊరేగింపులో కళాకారుల ప్రదర్శన


బోనం తీసుకెళ్తున్న మహిళ

కొండపోచమ్మతల్లికి

నీరాజనం

యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘటం ధూంధాం

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మకు భక్తులు పోటెత్తారు. మూడోవారం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు సోమవారం అమ్మసన్నిధికి చేరుకోవడంతో భక్తజనసందోహంగా మారింది. అమ్మవారి దర్శనానికి లైన్‌లలో గంటల తరబడి పిల్ల పాపలతో కలిసి వేచి ఉన్నారు. శివసత్తుల సిగాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పులచప్పులతో అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగి బోనాలు సమర్పించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏటా అమ్మవారి జాతరను పురస్కరించుకొని హైదరాబాద్‌కు చెందిన యాదవ సంఘం నాయకుడు బోయిని సాయియాదవ్ ఆధ్వర్యంలో బోనం, ఘటం ధూంధాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం అమ్మవారి ఘటాన్ని ఊరేగించారు. ఆర్‌కేస్ట్రా బృందం ఆధ్వర్యంలో ఘనంగా ధూంధాం కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గజ్జ రమేష్, హైదరాబాద్ యాదవ సంఘం నాయకులు బొంతు శ్రీదేవి, నవీన్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణయాదవ్, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.





పర్యావరణహిత పరిణయం

వివాహ వేదికలోకి రాగానే పూలు, పన్నీరుతో స్వాగతం, తామరాకు తొట్టిలో ఫలహారం, మట్టితో చేసిన గ్లాసులో చల్లని పానియం, వేదికంతా ప్రకృతితో మమేకమయ్యేలా అలంకరణ, నోరూరించే 21 రకాల వంటకాలతో అరిటాకుల్లో భోజనం, మర్యాదగా కూర్చొపెట్టి... కొసరి కొసరి వడ్డించడం, ఆహా ఆ వేడుక చూడటానికి రెండు కళ్లు సరిపోవు కదా. ఇదంతా ఒకటైతే వేడుక అంతా పర్యావరణహితమే. ఇలాంటి కార్యక్రమానికి సంఘం పద్మ మధుసూధన్‌రెడ్డి చిన్నకుమారుడి వివాహం వేదికైంది. సోమవారం సిద్దిపేటలో పోలీస్ కన్వెన్షన్‌హాల్‌లో జరిగింది. ఈ స్ఫూర్తితో అందరూ జీరో వేస్ట్ కార్యక్రమాలను నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రీత్‌కుమార్ కోరారు. అందుకు తమ సహకారం ఉంటుందని తెలిపారు.

- సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

బీరప్ప ఆలయ నిర్మాణానికి భూమి పూజ

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలం అంబాజీపేట గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలోని సోమవారం బీరప్ప ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భూమి పూజ చేశారు.

వృద్ధాశ్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి: ఆర్డీవో

పటాన్‌చెరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు వృద్ధాశ్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ పేర్కొన్నారు. సోమవారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ద నెస్ట్ వృద్ధాశ్రమాన్ని తనిఖీ చేసి, వృద్ధుల సమస్యలు తెలుసుకున్నారు. ఆర్డీవో వెంట జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి, తహసీల్దార్ రాధ, ఆశ్రమ నిర్వాహకులు అరుణ, వంశీకృష్ణ, ఆర్ఐ రఘునాథ్‌రెడ్డి ఉన్నారు.

పోలీస్ పహారాలో సామ్యతండా

శివ్వంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని టిక్యా దేవమ్మగూడెం పంచాయతీ పరిధిలోని సామ్యాతండాలో గిరిజన యువకుడు మదన్‌లాల్ ఆదివారం ఇంట్లో హత్యకు గురైన నేపథ్యంలో తండాలో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగాకృష్ణ, ఎస్ మధుకర్‌రెడ్డి నేతృత్వంలో పోలీస్ పహారాలో భారీ పోలీసు బందోబస్తు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

కుంటలో వ్యర్థాల తొలగింపు

ఐడీఏబొల్లారం ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పారిశ్రామిక పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా అధికారుల బృందం రంగంలోకి దిగింది. మున్సిపల్ ప్రత్యేక అధికారి ఫాల్గుణరావు ఆదేశాల మేరకు సోమవారం కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం పట్టణంలో పర్యటించింది. పార్కులు, కుంటలు, బస్తీల్లో శుభ్రతపై ప్రత్యక్ష పరిశీలన చేశారు. మాధవానికుంటను బతుకమ్మ ఘాట్‌గా తీర్చిదిద్దారు. సోమవారం మున్సిపల్ సిబ్బంది కుంటలో పారబోసిన వ్యర్థాలు తొలగించారు.

తూప్రాన్‌లో 'దండోరా' షూటింగ్

తూప్రాన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని శ్రీవెంకటేశ్వర సినిమా థియేటర్‌లో సోమవారం 'దండోరా' సినిమా షూటింగ్ నిర్వహించారు. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై బెన్ని ముప్పనేని నిర్మాతగా మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వంలో బిగ్‌బాస్ ఫేమ్ రవికృష్ణ, మణిక హీరోహీరోయిన్లుగా శివాజీ, నందు, నవదీప్ తదితరులు ప్రధాన పాత్రదారులుగా నటిస్తున్నారు.

ఘనంగా వీరభద్రస్వామి ఉత్సవాలు

కల్హేర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని వీరభద్రస్వామి ఆలయ ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. వసంత పంచమి సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా మహారుద్రభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన అగ్నిగుండం ఉత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్‌రావ్ పాటిల్, ఓంకార్‌స్వామి, అప్పారావ్‌పాటిల్, శివస్వామి, దాతలు ఆలూరె హన్మంత్‌రావ్, వీర్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' సమస్యలను నిర్లక్ష్యం చేయకండి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చే సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని, వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామానికి చెందిన చాకలి నర్సింలు తమకు సంబంధించిన భూమిలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఎలాంటి పరిహారం ఇవ్వలేదని, కనీసం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు ఇవ్వలేదని అర్జీలో పేర్కొన్నారు. తమకు పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని దీనంగా వేడుకున్నారు. తెల్లాపూర్‌లో సర్వే నెంబర్ 94లో గల శ్మశానవాటికను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని కబ్జాకు గురైన స్థలాన్ని కాపాడాలని స్థానికులు మాణిక్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సాయిరెడ్డి, బల్వంత్‌రెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వీటితో పాటు వివిధ సమస్యలపై 63 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, కలెక్టరేట్ ఏవో పరమేశం, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నా పింఛన్ రాలేదని, కనీసం ఇప్పుడైనా తనకు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని నారాయణఖేడ్‌కు చెందిన దివ్యాంగురాలు ప్రమీలమ్మ ప్రజావాణిలో అర్జీ అందజేశారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: మెదక్ ఎస్పీ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజల నుంచి హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజావాణి దరఖాస్తుల స్వీకరించారు. జిల్లా నలుమూల నుంచి 40 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

ఎన్నికల కోడ్‌తో పథకాలను ఆపేందుకు కుట్ర

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నెపంతో పథకాలను ఆపేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినందుకు సోమవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చింతా ప్రభాకర్‌ను మాజీ కౌన్సిలర్లు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారడంతో సంగారెడ్డి, సదాశివపేట అభివృద్ధికి మంజూరైన పనులను రద్దు చేసిందన్నారు. నాలుగు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పి నియోజకవర్గంలో 86 గ్రామాలు ఉంటే మండలానికి ఒక గ్రామంలో పూర్తిస్థాయిలో పథకాలను అమలు చేయని పరిస్థితిలో కాంగ్రెస్ పాలన ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సంగారెడ్డి, కంది మండల అధ్యక్షుడు చక్రపాణి, మధుసూధన్‌రెడ్డి, నాయకులు చక్రపాణి, వరల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను శాలువాతో సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్లు

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రాధాన్యం



శివానగర్‌లో మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

జిన్నారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నదని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం శివానగర్‌లో నిర్వహించిన మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం, జాతరలో పాల్గొన్నారు. ఆలయాల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, నాయకులు రేఖా కృష్ణ, పూజారి రాజు, జనార్ధన్ పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలకు నిధులు

నర్సాపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ నియోజకవర్గంలోని 172 గ్రామాల్లో ఉన్న ఎస్సీ కాలనీలకు మురుగు కాల్వల నిర్మాణం కోసం రూ.10.04 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని దాదాపు 172 గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో మురుగుకాల్వలు, సీసీరోడ్ల నిర్మాణం కోసం ఈ నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు.

కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

- డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్

నర్సాపూర్/పటాన్‌చెరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో తెలంగాణ పట్ల తీవ్ర వివక్ష చూపి అన్యాయం చేసిందని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి విమర్శించారు. సోమవారం పీసీసీ పిలుపు మేరకు నర్సాపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించి, ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, లలిత, పార్టీ మండల అధ్యక్షులు మల్లేశం, శ్రీనివాస్‌రావు, సుదర్శన్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు అంజిగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, నాయకులు పాల్గొన్నారు. పటాన్‌చెరులోని జాతీయ రహదారిపై ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి నేతృత్వంలో ఆందోళన నిర్వహించి, బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఇందులో నాయకులు సంజీవరెడ్డి, మతిన్, అతిక్, యువరాజ్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్: ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దమ్మతల్లి ఆలయంలో గడప ప్రతిష్ఠాపన

మనోహరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం గడప ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బండ ప్రకాష్‌ముదిరాజ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారికి సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్‌ముదిరాజ్ స్వాగతం పలికారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి, మహిపాల్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాలకవర్గం వల్లే ఎస్టీపీకి నిధులు

- బీజేపీ, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కాదు
- బీఆర్ఎస్ నాయకులు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్‌లో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)ను నిర్మించాలని డిమాండ్ చేసి, రూ.60 కోట్లను సాధించింది అప్పటి తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లెపల్లి లలితాసోమిరెడ్డి, వైస్‌చైర్మన్ బాలగోని రాములుగౌడ్ పాలకవర్గమని బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు జి.సాగర్ తెలిపారు. సోమవారం తెల్లాపూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన కాలువల్లో నిత్యం మురుగునీరు ప్రవహించి, చెరువులు కలుషితమౌతున్నాయని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. సమస్య పరిష్కారానికి ఎస్టీపీ నిర్మాణం ఒక్కటే మార్గమని అధికారులు సూచించారన్నారన్నారు. ఎస్టీపీ నిర్మాణానికి సుమారు రూ.300 కోట్ల వరకు వ్యయం అవుతుందని, ఇందుకు నిధులు మంజూరు చేయాలంటూ లలితాసోమిరెడ్డి 2021లో హైకోర్టును ఆశ్రయించారని గుర్తుచేశారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీపీ నిర్మాణానికి ఇటీవల రూ.60 కోట్లు మంజూరు చేసిందని, ఇందుకు సంబంధించిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు నాగరాజు, శ్రీశైలం యాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు శ్రీపాల్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కల్లెం మోహన్‌రెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

బడ్జెట్‌పై కాంగ్రెస్ మతిలేని మాటలు



మల్లేశంగౌడ్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ నాయకులు మతిలేకుండా మాట్లాడుతున్నారని బీజేపీ నేత మల్లేశంగౌడ్ మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన ఆయన తొలిసారి సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. 2047 నాటికి వికసిత్ భారత్ కల సాకారానికి ముందడుగే ఈ బడ్జెట్ అన్నారు. ఈ సందర్భంగా మల్లేశంగౌడ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు ఎంఎల్ఎన్‌రెడ్డి, లోకేష్ వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు వీణ, సతీష్‌పటేల్, పట్టణ అధ్యక్షులు ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు పెరగాలి

- పాత పంటల జాతర కో ఆర్డినేటర్ వినయ్‌కుమార్

కోహీర్, ఫిబ్రవరి 3: (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చిరుధాన్యాల సాగు పెరగాలని పాత పంటల జాతర కో-ఆర్డినేటర్ వినయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని గొడిగర్‌పల్లి గ్రామంలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) సభ్యులు సోమవారం చిరుధాన్యాల విశిష్టతను వివరిస్తూ 25వ పాత పంటల జాతర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ రైతులు ఎడ్లబండ్లకు పూజచేసి ఊరేగింపు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీఎస్ సంఘం సభ్యులు పాటలు, ఆటల ఆడుతూ విత్తనాలతో అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపులో గ్రామ ప్రజలకు చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ లయ, డీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవద్దు'

కొడిపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్వార్థ రాజకీయాల కోసం కొంతమంది గౌడ సంఘం నాయకులు 4 గుంటల భూమి ఇచ్చిన దాతనే మరిచారని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన భూదాత సార రామగౌడ్ అన్నారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పదేళ్ల క్రితం ఎల్లమ్మ గుడి నిర్మాణం కోసం తాను భూమిని ఇచ్చానని తెలిపారు. తమపై గౌడ కులస్తులు కక్ష సాధింపులకు పాల్పడుతూ.. గుడి నిర్మాణానికి సహకరించని వారికి సన్మానం చేస్తున్నారన్నారు. శివాలయం నిర్మాణానికి మరో రూ.5 లక్షల భూమిని కూడా దానం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని రామగౌడ్ స్పష్టం చేశారు.

'ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి'

వట్‌పల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని బీచ్కుంద మఠం పీఠాధిపతి సోమలింగ శివాచార్య మహాస్వామి అన్నారు. మేడుకుందాలో నిర్మించిన శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా సోమవారం శివలింగం,నవగ్రహాలు, గజస్థంభం, జంటనగులకు ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ హిందూధర్మం ప్రపంచంలోనే గొప్పదన్నారు.



శివ్వంపేట: పూజలు నిర్వహించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



తూప్రాన్ మండలం యావాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసంలో చిన్నారులు



కోహీర్‌లోని శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా వసంత పంచమి

వసంత పంచమి వేడుకలు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సరస్వతీ, శిశుమందిర్ ఆలయాల్లో అమ్మవారికి కుంభాభిషేకం, పంచాసూక్తములతో పంచామృతాభిషేకం, మంగళహారతి, కుంకుమార్చనలు, ప్రదోష పూజలు వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

- న్యూస్ నెట్‌వర్క్



సంగారెడ్డి డ్రైవర్స్ కాలనీలోని శ్రీ విద్యాసరస్వతీ ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిపిస్తున్న ఆలయ అర్చకులు మీనానాథ్‌శర్మ

రండి.. చేరండి..

5వ పేజీ తరువాయి

లైబ్రేరియన్ భాగ్యలక్ష్మితో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. వీరు జిల్లా స్థాయిలో కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల హాజరుశాతంతోపాటు వారు స్టడీ అవర్స్‌కు హాజరువుతున్నారా.. లేదా.. కళాశాలలో నిర్వహిస్తున్న స్లిప్ టెస్టులు రాస్తున్నారా లేదా పరిశీలించి నిత్యం రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెల్‌కు ఆన్‌లైన్‌లో సమాచారం అందించాల్సి ఉంటుంది.

జిల్లాలో ఇలా..

మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 16 , గురుకులాలు, కేజీబీవీలు 33, ప్రైవేటు జూనియర్ కాలేజీలు 10, మొత్తం 59 కళాశాలలున్నాయి. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 6,066, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6418 మంది, మొత్తం 12,484 మంది విద్యార్థులు ఉన్నారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమాల్లో బోధన చేస్తున్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఎంసెట్, నీట్‌పై శిక్షణ, ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజన కూడా అమలు కానుంది.

అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు



ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి ప్రచారం చేయాలని ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశించారు. ఈమేరకు జిల్లాలో లెక్చరర్లు పాఠశాలలను సందర్శిస్తున్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సర్కార్ కాలేజీల్లోని సౌకర్యాలు, కోర్సులు వివరిస్తున్నారు.

- మాధవి, ఇంటర్ జిల్లా నోడల్ అధికారి

కాగితాల్లోనే కాసులు

5వ పేజీ తరువాయి

ప్రతీ సంవత్సరం రూ.9 లక్షల చొప్పున మూడేళ్ల పాటు నిధులు మంజూరు కావాల్సి ఉన్నా ఇంతవరకు రాలేదని ఆస్పత్రి వర్గాలు వివరించాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని మార్క్సనగర్, ఇంద్రనగర్ యూపీహెచ్‌సీలతో పాటు న్యాల్‌కల్, మునిపల్లి, కంగ్టి, బొల్లారం, ఆత్మకూర్, ఝరాసంగం, రాయికోడ్, మొగుడంపల్లి, ఆర్సీపురం, కొండాపూర్ పీహెచ్‌సీలు 2023 ఏడాదిలో ఎన్‌క్వాస్ అవార్డులకు ఎంపికయ్యాయి. ఆయా ఆరోగ్య కేంద్రాలకు రూ.3 లక్షల చొప్పున మూడేళ్లలో రూ.9 లక్షల నిధులు మంజూరుకావాల్సి ఉన్నా.. ఇప్పటి వరకు జాడ లేదని ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు తెలిపారు. గతేడాది మార్చిలో అవార్డులు వరించిన ఆస్పత్రులకు ప్రోత్సాహక నగదు కూడా విడుదలైనట్టు ప్రొసీడింగ్స్ కూడా వచ్చాయని జిల్లా వైద్యాధికారులు పేర్కొన్నారు. కానీ, ఇప్పటి వరకు ఆయా ఆస్పత్రుల ఖాతాల్లో నిధులు జమ కాలేదని వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రజలకు మేలు: ఎమ్మెల్సీ

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రజలకు మేలు జరిగిందని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. చిన్నశంకరంపేట మండలం కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్తకు చెందిన నూతన గృహ ప్రవేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డితో కలిసి సుభాష్‌రెడ్డి పాల్గొని, సత్యనారాయణస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, మాజీ జడ్పీటీసీ మాధవీరాజు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాలాజీ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని బాలాజీ ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం శ్రీదేవి భూదేవి సమేత విరాట్ వేంకటేశ్వరస్వామి దివ్యలీలా కల్యాణాన్ని వేదపండితుడు శ్యామ్‌కుమార్‌శర్మ సమక్షంలో ఘనంగా జరిపించారు. మహాగణాధిపతి దివ్యప్రతిష్ఠ, అంగహోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపించారు. బ్రహ్మోత్సవాల్లో మంజీరనగర్‌కు చెందిన శారదా సంగీత విభావరి నిర్వాహకులు శ్వేతజోషి ఆధ్వర్యంలో భక్తిగీతాలతో సంగీత విభావరి నిర్వహించారు.



శ్వేతజోషి ఆధ్వర్యంలో సంగీత విభావరి

జిన్నారంలో ఇక ఐదు ఎంపీటీసీ స్థానాలు

జిన్నారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలంలో ఐదు ఎంపీటీసీ స్థానాలతో అధికారులు ముసాయిదాను ప్రకటించారు. మండలంలోని పది గ్రామపంచాయతీలు, ఐదు ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటుచేస్తూ అధికారులు ముసాయిదాను తయారుచేశారు. జిన్నారం పరిధిలో రెండు ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. ఊట్ల, మంగంపేట 1, సోలక్‌పల్లి, రాళ్లకత్వ, అండూరు పరిధిలో 1, శివానగర్, కొడకంచి, నల్తూరును కలిపి మరొక ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేశారు. గతంలో ఎనిమిది ఎంపీటీసీ స్థానాలు ఉండగా. ఇటీవల గడ్డపోతారం నూతన మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య ఐదుకు తగ్గింది.

కాకతీయనగర్‌లో థీమ్‌పార్కు

రామచంద్రాపురం టౌన్ ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో పార్కులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్‌యాదవ్ అన్నారు. సోమవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి కాకతీయనగర్ కాలనీలో కేటాయించిన స్థలంలో థీమ్ పార్కు ఏర్పాటు చేసే అంశంపై హెచ్ఎండీఏ డిజైనర్ శ్రీవిద్య సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 3.5 వేల గజాల స్థలాన్ని అధికారులకు అప్పగించామని తెలిపారు. దీనిలో థీమ్ పార్కు నిర్మాణం చేయడానికి ప్రత్యేకంగా నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు.

గిరిజనుల దాహార్తిని తీర్చిన పారిశ్రామికవేత్త

కోహీర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత కే.ప్రసాద్‌రెడ్డి తన సొంత నిధులతో గిరిజనుల తాగునీటి ఇబ్బందులను దూరం చేశారు. కోహీర్ మండలంలోని పీచేర్యాగడితండాలో గిరిజనులకు తాగునీటి ఇబ్బందులు ఉండడంతో ప్రభుత్వపరంగా తాగునీటి బోరు మంజూరైంది. అయితే నీరు పూర్తిస్థాయిలో అందకపోవడంతో.. రీబోర్ చేయించేందుకు కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాథోడ్ వినోద్‌కుమార్ ప్రసాద్‌రెడ్డిని సంప్రదించగా.. తక్షణమే స్పందించి రూ.80 వేల సొంత నిధులతో గిరిజనులకు తాగునీటి సమస్యను తీర్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మునిపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామంలోని గురుకుల పాఠశాలలో 1985-1988 వరకు చదువుకున్న ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పెద్దాపూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.